భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన మహిళలు
- సామూహిక వ్రతాలు నిర్వహించిన ప్రజలు

పాలమూరు, నవంబర్ 15 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మధుసూదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు, పర్యవేక్షకులు నిత్యానందచారి, పాల్గొన్నారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, నవంబర్ 15 : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ నోములను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు దీపాలను వెలిగించి, శివలింగానికి అర్చనలు, అభిషేకాలను చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మంజునాథ్, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, కమిటీ సభ్యులు, మహిళ పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, నవంబర్ 15 : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. భక్తుల సందర్శనతో ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. మహిళలు ఆలయాల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. పలు గ్రామాల్లో భక్తులు శివాలయాలను దర్శించుకుని అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించుకున్నారు.

మక్తల్‌లో..

మక్తల్, నవంబర్ 15 : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం మక్తల్ మండల వ్యాప్తంగా ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలడాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి, నల్లజానమ్మ, కుంభేశ్వరాలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు కార్తిక దీపోత్సవం వెలిగించి మొక్కలను చెల్లించుకోన్నారు.

సింహగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

మూసాపేట రామస్వామి గుట్టపై లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

మూసాపేట : పోల్కంపల్లిలో వ్రతాలను నిర్వహిస్తున్న భక్తులు

భూత్పూర్‌లో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

వైభవంగా లక్ష బిల్వార్చన, దీపోత్సవం

మూసాపేట, నవంబర్ 15 : మండల కేంద్రంలోని రామస్వామి కొండపై ఉన్న రామలింగేశ్వ ర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు సంకలమద్ది, తుంకినిపూర్, వేముల, కోమిరెడ్డిపల్లి, నిజాలాపూర్, అచ్చాయిపల్లి, దాసరిపల్లి తదితర గ్రా మాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామికి అభిషేకం, అ ర్చనలతో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా దక్షిణ కాశిగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో లక్షదీపోత్సవ వేడుకను నేత్రానందంగా సాగింది. కార్యక్రమానికి కార్యక్రమంలో పంచవటి విద్యాలయ చైర్మన్ అనితాశ్రీకాంత్‌రె డ్డి, మధుయాదవ్, నర్సింహులు పాల్గొన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, నవంబర్ 15 : కార్తికపౌర్ణమి సందర్భంగా శుక్రవారం జడ్చర్ల మండల ప్రజలు ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు గౌరీ మాతకు నోములు నోచుకోవడంతోపాటు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. జడ్చర్ల వేంకటేశ్వరస్వామి, రేణుకాఎల్లమ్మ ఆలయాల్లో భక్తులు వ్రతాలు ఆచరించి కార్తీకదీపాలను వెలిగించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ

బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

మూసాపేట, నవంబర్ 15 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు రెడ్డి రాజు తండ్రి రామచంద్రయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలిసిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం తిమ్మాపూర్‌కు వెళ్లి అతని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యం చెప్పారు. ఆయ న వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, చంద్రశేఖర్, శివరాములు, యాసిన్‌పాషా, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ అభ్యర్థులకు గ్రూప్-4 ఉద్యోగాలు

ఎస్సీ స్టడీ సర్కిల్ అభ్యర్థులతో డైరెక్టర్ కాడం శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 15: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 9మంది అభ్యర్థులు గ్రూప్-4 ఉద్యోగాలు సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఘనంగా సత్కరించారు. గత నెలలో ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో నూ 14 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని, 2 సంవత్సరాల్లో మొత్తం 75 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. గ్రూప్-4 ఉద్యోగాల్లో భాగం గా సీసీఎల్ఏ, ట్రెజరీస్, మున్సిపల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, జీహెచ్ఎంసీ, ఎంజేపీఎడ్యుకేషన్ సొసైటీ శాఖల్లో మొత్తం 9 మంది వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్, అనిల్‌కుమార్, సుకుమార్, ఆశన్న, అజయ్‌కుమార్, అఖిల, శ్రావణి, రమేశ్ ఎంపికయ్యారని పేర్కొన్నారు.

శ్రీచైతన్యలో చిల్డ్రన్స్‌డే సంబురాలు

విజేతలతో ప్రిన్సిపాల్ శ్రీధర్, ఇన్‌ఛార్జి ప్రియా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 15 : శ్రీచైతన్య సెంట్రల్ స్కూల్ బ్రాంచ్-2లో గురువారం చిల్డ్రన్స్‌డే సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, కార్యక్రమ ఇన్‌ఛార్జి ప్రియా ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-338958-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

కలెక్టరేట్‌లో భగవాన్ బిర్సాముండా జయంతి

- ఉట్టిపడిన గిరిజన సంస్కృతి సంప్రదాయాలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబర్ 15 : ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతిని శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బిర్సా భగవాన్ ఆదర్శాలు గిరిజన యువతకే కాదు, దేశ నలుమూలలా అన్ని సామాజిక వర్గాల యువజనులకూ ఆదర్శప్రాయం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌తో మరింత సమగ్రమైన గిరిజనాభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రం బాటలు వేసిందన్నారు. గిరిజన పోరాట చరిత్ర మానవాళికి అపూర్వ సందేశాన్నిస్తోంది. ప్రకృతిని పరిరక్షించాల్సిన అవసరాన్ని, పర్యావరణంలో మమేకమై జీవించాల్సిన అనివార్యతను ఆధునిక ప్రపంచానికి తెలియజేస్తోందన్నారు. ఆదివాసీ సమాజాలు వ్యక్తిగత ఆకాంక్షలకన్నా సమిష్టి మేలుకే ప్రాధాన్యమిస్తాయని పేర్కొన్నారు.

నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా ఏర్పాట్లు

బీహార్ రాష్ట్రం జముయి నుంచి రూ.6600కోట్ల పథకాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభోత్సవం, ప్రజలకు అంకిత కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా చేసిన నృత్యాలు, వివిధ రకాల కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రునాయక్, డీపీఆర్వో శ్రీనివాస్, ప్రత్యేక అధికారి గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ ఈఈ భాషా, డీఎంహెచ్‌వో డా.కృష్ణ, అధికారులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠ ఆలయానికి మకరతోరణం బహూకరణ

మకర తోరణం అందజేస్తున్న భక్తులు

నారాయణపేట టౌన్, నవంబర్ 15 : పట్టణంలోని బారంబావి నీలకంఠ మందిరానికి శుక్రవారం మకర తోరణాన్ని చౌదర్ గూడెంకు చెందిన ఘట్టప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు బహూకరించారు. అంతకుముందు స్వామి వారికి మహా అభిషేకం, యజ్ఞం, నైవేద్యం, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రత్నబాయి, బాలరాజు, రాములప్ప, శ్రీకాంత్, శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూసాపేట, నవంబర్ 15 : లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సంకలమద్ది గ్రామ శివారులో జాతీయ రహదారిపై కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే లారీ గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టినట్లు తెలిపారు. తీవ్రగాయాలు కావడంతో ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని, అతని వయస్సు దాదాపు 45 వరకు ఉంటుందని, అతను కొంతకాలంగా మూసాపేట, అడ్డాకుల మండలాల జాతీయ రహదారిపై భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా దవాఖానలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు ఎవరికైనా తెలిస్తే మూసాపేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

జేపీఎన్‌సీఈలో కొత్త కోర్సులు

- జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్.రవికుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 15 : ఉద్యోగ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి కొత్త కోర్సులు ఉమ్మడి పాలమూరు జిల్లా విద్యార్థులకు అందుబాటులో రానున్నాయని జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చైర్మన్ కేఎస్.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం ధర్మాపూర్ సమీపంలోని జేపీఎన్‌సీఈలో జేఎన్‌టీయూ సిలబస్‌తో పాటు వివిధ రకాలైన కొత్త కోర్సులను ప్రవేశ పెట్టేందుకు దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంజినీరింగ్ స్టాప్ కాలేజ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ప్రభుత్వ రంగ సంస్థతో ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు తెలిపారు. పాలమూరు వాసి ఇంజినీరింగ్ స్టాప్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు సహకారంతో ఈ ఎంవోయూ చేసుకున్నట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌సీఐ ప్రతినిధులు, ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఒప్పంద దస్త్రాలు ప్రదర్శిస్తున్న ఈఎస్‌సీఐ ప్రతినిధులు

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

మక్తల్, నవంబర్ 15 : అంబులెన్స్‌లోనే ఓ గర్భాణి ప్రసవించిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. అంబులెన్స్ ఈఎంటీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మాగనూరు మండలం పరమానందటికి చెందిన గర్భిణి భాగ్యలక్ష్మి తన తల్లి లక్ష్మి ఇంటికి ప్రసవం కోసం మక్తల్ మండలం టేకులపల్లికి వచ్చింది. కాగా గురువారం సాయంత్రం గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గర్భిణి తల్లి లక్ష్మి మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించేందుకు 108 అంబులెన్స్ సమాచారం ఇవ్వగా హుటాహుటిన 108 సిబ్బంది టేకులపల్లికి చోరుకొని గర్భిణి భాగ్యలక్ష్మిని ప్రసవం కోసం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తీసుకురాగా ఇక్కడి వైద్యులు గర్భిణికి ఉమ్మనీరు పోయినందువల్ల పేషెంట్‌ను నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకు వెళ్లాలని రెఫర్ చేయగా గర్భిణిని నారాయణపేట జిల్లా దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ ఆప్తనాలిస్ట్ డాక్టర్ లేకపోవడంతో అక్కడి సిబ్బంది మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు. నారాయణపేట నుంచి నిండు గర్భిణిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలిస్తుండగా శుక్రవారం ఉదయం 2 గంటలకు పాలమూరు యూనివర్సిటీ ప్రాంతంలో భాగ్యలక్ష్మి అంబులెన్స్‌లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనించింది. అంబులెన్స్‌లో ప్రసవించిన తల్లి బిడ్డలను మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానలో అడ్మిట్ చేశామని తల్లి బిడ్డలు ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

ఆడబిడ్డకు జన్మనిచ్చిన భాగ్యలక్ష్మి

అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం

అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పాలమూరు, నవంబర్ 15 : జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు అయ్యప్ప స్వామి మాలాధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు ఆర్యవైశ్య భవనంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో 2వేల దీపాలతో దీపారాదన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పాత పాలమూరు పాత శివాలయం, వీరన్నపేటలోని శివాలయం, శ్రీనివాస కాలనీ పంచముఖి ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి నాగరాజు, అయ్యప్ప స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, నవంబర్ 15 : పట్టణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో స్టెనో, టైపిస్ట్, రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్టెనో, టైపిస్ట్ 1(జనరల్), రికార్డ్ అసిస్టెంట్ 1(జనరల్) పోస్టులను నేరుగా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. స్టెనో, టైపిస్ట్ పోస్టుకు యూజీసీ గుర్తింపు పొందిన ఏదైనా డిగ్రీ, 120 డబ్ల్యూపీఎం వేగంతో ప్రభుత్వ సాంకేతిక పరీక్షలో ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉతీర్ణులై ఉండాలని సూచించారు. ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ అందుబాటులో లేకుంటే ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్ లోయర్ గ్రేడ్‌లో పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ఆంగ్లంలో హయ్యర్ గ్రేడ్‌లో టైప్ రైటింగ్‌లో ప్రభుత్వ సాంకేతిక పరీక్షలో ఉతీర్ణులై ఉండాలని, టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ అందుబాటులో లేకుంటే లోయర్ గ్రేడ్ పరిగణించబడుతుందని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటింగ్‌లో పరిజ్ఞానం లేదా అర్హత కలిగి ఉండాలని సూచించారు. సెప్టెంబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తయి, 34 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు 5 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.800డీడీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.400 డీడీ రూపంలో ది సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నారాయణపేట పేరుపై చెల్లించాలన్నారు. టైపిస్ట్, స్టెనో గ్రాఫర్ పోస్టుకు రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ నిర్వహించి ఓరల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక, రికార్డు అసిస్టెంట్ పోస్టుకు రాత పరీక్ష, ఓరల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30లోగా రిజిస్టర్ లేదా కొరియర్ ద్వారా చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణం, నారాయణపేట కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు http:/ecourts.gov.in/Narayanpet వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అన్నదాతలను మోసం చేసిన ప్రభుత్వం

ధన్వాడ, నవంబర్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఎన్నికల సమయంలో అన్నదాతలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి ఆరోపించారు. శుక్రవారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుబంధు మొత్తాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏడాది కాలంగా రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేయకుండా మోసం చేసిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిగా రుణమాఫీ చేసి, రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

నారాయణపేట, నవంబర్ 15 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సత్యానారాయణ చౌరస్తా వద్ద ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి ఆటోలో పిల్లలను, కూలీలను ఎక్కించుకోరాదని పేర్కొన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ప్రజలు సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు ఆంజనేయులు, వాహనదారులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు